మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.6 కనిష్ఠం 17.8

శ్రీతేజ్ త్వరగా కోలుకోవాలి

రాంగోపాల్‌పేట్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేళ శ్రీతేజ్ త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. సంధ్య థియేటర్ ఘటనలో గాయపడి కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడిని మంగళవారం ఆమె పరామర్శించారు. శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితిని చూసి భావోద్వేగానికి గురయ్యారు. శ్రీతేజ్ తండ్రి భాస్కర్‌కు ధైర్యం చెప్పారు. ఆరోగ్యం కాస్త మెరుగుపడడంతో వెంటిలేటర్ తొలగించినట్లు వైద్యులు తెలిపారు.


దుర్గంచెరువు వద్ద వేడుకల హంగామా


సచివాలయం వద్ద సందడి


నటి దక్ష నృత్యం

నయాసాల్.. ఫుల్ 'జోష్'

కొత్త సంవత్సరానికి ఉత్సాహంగా స్వాగతం పలికిన నగరవాసులు ● పబ్‌లు, క్లబ్‌లలోనే సందడి అధికం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కొత్త ఆశలతో నూతన సంవత్సరానికి నగరవాసులు ఉత్సాహంగా స్వాగతం చెప్పారు. ఈసారి వేడుకలలో గాయకులు, లైవ్ బ్యాండ్‌ల సందడి అధికంగా కనిపించింది. గతంలో వేడుకల్లో యువత అధికంగా కనిపించేది. ఈసారి పెద్దలు కూడా బాగానే సందడి చేశారు.

పోలీసుల నజర్

నూతన సంవత్సర వేడుకల్లో డ్రగ్స్ వినియోగానికి అడ్డుకట్ట వేసేందుకు పోలీసు అధికారులు విశేషంగా కృషి చేశారు. ఎక్కడికక్కడ డ్రంకెన్ డ్రైవ్, డ్రగ్ టెస్టులు చేశారు. నగరంలోకి డ్రగ్స్ సరఫరా కాకుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిఘాపెట్టారు. కొత్త సంవత్సరం వేడుకల్లో మద్యం ఏరులై పారింది. నగరంలో పలు ప్రాంతాల్లో ఉన్న వైన్ షాపులకు జనం పోటెత్తారు. క్యూలో నిలబడి మద్యం కొనుగోలు చేశారు.


నూతన సంవత్సర వేడుకల్లో మోడల్స్


డ్యాన్స్ చేస్తున్న సీనియర్ సిటిజన్స్

గండిపేట కాలువకు లీకేజీలు

- పది రోజులుగా రోడ్డుపై పారుతున్న నీరు
- పట్టించుకోని జలమండలి అధికారులు


కోకాపేట్‌లో గండిపేట కాలువ నుంచి రోడ్డుపై పారుతున్న నీరు

నార్సింగ్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): గండిపేట కాండూట్ (కాలువ)కు కోకాపేటలో పది ప్రాంతాల్లో లీకేజీలు ఏర్పడ్డాయి. దీంతో నీరు వృథాగా పోతోంది. పది రోజుల నుంచి కొన్ని లక్షల లీటర్ల నీరు రోడ్డుపై పారుతుండడంతో పాకుడు పట్టి వాహనాలు జారి పడిపోతున్నాయి. నీరు వృథాగా పోతున్నా జలమండలి అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

సరిపోదా ఆదివారం



2025లో సరికొత్త ప్రణాళికకు ఒకరోజు

- ఈ ఏడాది 52 ఆదివారాలు
- వ్యక్తిత్వ వికాసానికి ప్రణాళికలు రచించుకోవాలంటున్న నిపుణులు

'వారం ఆరు రోజులూ శ్రమకే జీవితం (కార్పొరేట్ ఉద్యోగులకు మినహాయింపు).. ఆదివారం మాత్రం మనకే అంకితం' చేసుకోవాలని సూచిస్తున్నారు వ్యక్తిత్వ వికాస నిపుణులు. పిల్లలకైనా పెద్దలకైనా వారంలో ఇష్టమైన రోజంటే ఆరోజే. ఆదివారాలను సరిగా సద్వినియోగం చేసుకుంటే ఆనందం మన సొంతం అవుతుంది అంటున్నారు. 2025లో ఉండే 52 ఆదివారాలను మనల్ని మనం తీర్చిదిద్దుకోవడానికి ఆరంభంలోనే ప్రణాళికలు రచించుకోవాలని సూచిస్తున్నారు.

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరం తొలి రోజు బుధవారంతో మొదలుకాగా ఈ ఏడాది చివరి రోజు కూడా అదే వారం కావడం 2025 విశేషం. అయితే మన కోసం కేటాయించుకోగలిగినది ఆదివారం. అవి ఈ ఏడాదిలో 52 ఉన్నాయి. అంటే 1,248 గంటలు..74,880 నిమిషాలు.. 44,92,800 సెకన్లు. వ్యాపారులు కాస్త బడలిక తీర్చుకోవడానికి మిగిలిన రోజు కూడా అదే! ఆదివారాన్ని జాగ్రత్తగా ప్లాన్ చేసుకుంటే తర్వాత ఆరు రోజులు ఆహ్లాదంగా గడిపేయొచ్చని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ వంగీపురం శ్రీనాథాచారి సూచిస్తున్నారు.

నచ్చిన పుస్తకాలు

మిత్రులందరూ దూరమైనా మనతో మిగిలిపోయే ఒకే ఒక్క నేస్తం పుస్తకం. బిజీలైఫ్‌లో పడిపోయి పుస్తకాలకు దూరమైన వారంతా ఆదివారాలు పుస్తక పఠనానికి కొంత సమయం కేటాయించుకోవచ్చు. ఒక్కో ఆదివారం ఒక్కో పుస్తకం చొప్పున చదివినా ఏడాది మొత్తంగా 52 పుస్తకాలు చదివేయొచ్చు. కథ, నవల, చరిత్ర, సామాజిక శాస్త్రాలు.. మన ఇష్టం. మన అభిరుచి మేరకు ఈ ఏడాది చదవాల్సిన పుస్తకాల లిస్టును ముందే సిద్ధం చేసుకుంటే, ఆరునూరైనా... ఎన్ని అడ్డంకులు ఎదురైనా అవి చదవాలి అని గట్టిగా సంకల్పం తీసుకుంటే.. విజయం మన వంతు అవుతుంది

సేవకు కొంత సమయం

నెలలో వచ్చే నాలుగు ఆదివారాల్లో కనీసం ఒక ఆదివారమైనా సామాజిక సేవాకార్యక్రమాల్లో పాలుపంచుకోడానికి కేటాయించాలి అని సామాజిక విశ్లేషకులు సూచిస్తున్నారు.

మందు పార్టీలా.. జాగ్రత్త

ఆదివారం వస్తే కొంతమంది మిత్రులు తోడవుతారు. బార్‌అండ్ రెస్టారెంట్‌కి వెళదామంటారు. ఆదివారం తాగడమో...నిద్ర

మిగతా 6వ పేజీలో..

పర్యాటకులు 1.92 కోట్లు

- 2024లో నగరాన్ని సందర్శించిన వారి సంఖ్య

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని హైదరాబాద్ టూరిజం కళకళలాడుతోంది. దేశ, విదేశాలకు చెందిన పర్యాటకుల సందర్శనతో పర్యాటక ప్రాంతాలు సందడిగా మారుతున్నాయి. 2024 జనవరి నుంచి డిసెంబర్ మూడో వారం వరకు సుమారు 1,92,67,890 కోట్ల మందికిపైగా ప్రాంతీయ పర్యాటకులు గ్రేటర్ టూరిజాన్ని సందర్శించినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

తరలివస్తున్న విదేశీ పర్యాటకులు

వివిధ పనులపై హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీ, చెన్నై లాంటి నగరాలకు వస్తున్న విదేశీయులు పనిలో పనిగా హైదరాబాద్ టూరిజాన్ని సందర్శిస్తూ ఇక్కడి మధుర జ్ఞాపకాలను మదిలో భద్రపరుచుకుంటున్నారు. చార్మినార్, గోల్కొండ కోట, సెవెన్‌టూంబ్స్, సాలార్‌జంగ్ మ్యూజియం సందర్శనకు వారు అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు పర్యాటకశాఖ అధికారులు చెబుతున్నారు. 2023లో 1,60,912 మంది విదేశీ టూరిస్టులు రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. ఇందులో 1,60,545 మంది హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల్లో తిరిగినట్లు లెక్కలు చెబుతున్నాయి. హైదరాబాద్ నగరంలోని టూరిజం స్థలాలను అత్యధిక సంఖ్యలో 1.23 లక్షల మంది ఫారిన్

మిగతా 6వ పేజీలో..

రూ. 815.76 కోట్లు

- 2024లో పట్టణ ప్రణాళిక విభాగానికి ఆదాయం

6

స్పెషల్ డ్రైవ్ మరో 90 రోజులు

నిర్వహణకు సీఎం ఆదేశాలు

ఇప్పటికే 1.75 లక్షల మ్యాన్‌హోళ్లలో పూడికతీత

> వాటర్‌బోర్డు అదనంగా ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా చేపట్టిన 90 రోజుల సివరేజీ స్పెషల్ డ్రైవ్ సత్ఫలితాలను సాధించింది. రోజువారీగా వచ్చే సివరేజీ ఫిర్యాదులను పరిష్కరిస్తూనే.. 90 రోజుల్లోనే 2,200 కిలోమీటర్ల సివరేజీ పైపులైన్లను శుభ్రం చేసింది. 1.75 లక్షల మ్యాన్‌హోళ్ల నుంచి పూడికతీశారు. ఈ నేపథ్యంలో స్పెషల్ డ్రైవ్ మరో 90 రోజులు కొనసాగించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలిచ్చారు.

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): సివరేజీ ఓవర్‌ఫ్లో ఫ్రీ సిటీగా హైదరాబాద్ మహానగరాన్ని తీర్చిదిద్దేందుకు, ఇంకుడు గుంతల నిర్మాణమే లక్ష్యంగా 90రోజుల స్పెషల్ డ్రైవ్‌ను వాటర్‌బోర్డు ఆధ్వర్యంలో 2024 అక్టోబరు 2న గాంధీ జయంతి రోజు ప్రారంభించారు. స్పెషల్ డ్రైవ్‌లో 3,600 కిలోమీటర్ల మేర సివరేజీ లైన్లను క్లీన్ చేయడం, 3 లక్షల మ్యాన్‌హోళ్ల నుంచి పూడికతీయడంతో 30% ఫిర్యాదులను తగ్గించాలని లక్ష్యం

మిగతా 6వ పేజీలో..

సమష్టి కృషి వల్లే..

స్పెషల్ డ్రైవ్ విజయవంతమవడంలో వాటర్‌బోర్డు అధికారులు, సిబ్బంది సమష్టి కృషి ఉంది. డ్రైవ్‌పై సీఎం నుంచి ప్రశంసలు రావడం హర్షణీయం. రాబోయే రోజుల్లో ఇంతకు మించి సామర్థ్యంతో పనిచేసేలా చర్యలు చేపడుతున్నాం.

\- అశోక్‌రెడ్డి, వాటర్ బోర్డు ఎండీ



రాయల్ ఎన్‌ఫీల్డ్ మాత్రమే..

ఆ బైక్‌లే లక్ష్యంగా చోరీలు

ఇద్దరు నిందితుల అరెస్ట్.. పరారీలో మరొకరు

రూ.46 లక్షల విలువైన 30 వాహనాలు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌లనే లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్న ఘరానా దొంగల ముఠా ఆటకట్టించారు రాచకొండ పోలీసులు. ఇద్దరిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 46 లక్షల విలువైన 30 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఎల్‌బీనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో రాచకొండ సీపీ సుధీర్‌బాబు మంగళవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

గోల్కొండ ప్రాంతానికి చెందిన మహ్మద్ షేక్ ఏసీ టెక్నీషియన్. అదే ప్రాంతానికి చెందిన మహ్మద్ ఇమ్రాన్, మరో ఇమ్రాన్ ఇద్దరూ ఆటో డ్రైవర్లు. ముగ్గురూ స్నేహితులు. బైక్‌లు చోరీ చేసి వాటిని ఇతర ప్రాంతాల్లో విక్రయించి జల్సా చేయాలని నిర్ణయించారు. ముఠాగా ఏర్పడ్డారు. నకిలీ తాళం చెవిలతో రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌లను చోరీ చేయడం ప్రారంభించారు.


స్వాధీనం చేసుకున్న బైక్‌లను పరిశీలిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

రూ. 10 వేలకే..

చోరీ చేసిన బైక్‌లను ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేట్ జిల్లాలోని పలు ప్రాంతాలకు తరలించి తెలిసిన వారి సహకారంతో విక్రయించేవారు. రూ. 60-80 వేలు ధర చెప్పి అడ్వాన్స్‌గా రూ. 10 వేలు తీసుకొని బైక్ ఇచ్చేస్తారు. వాహన పత్రాలు ఇచ్చిన తర్వాత మిగతా డబ్బు తీసుకుంటామని వెళ్లిపోతారు. తర్వాత పత్రాలు ఇవ్వరు.. మిగిలిన డబ్బు అడగరు. ఏడాది నుంచి మూడు పోలీస్ కమిషనరేట్ల పరిధుల్లో, వికారాబాద్, పరిగి, పటాన్

మిగతా 6వ పేజీలో..


ఇల్లాలి ఉసురు తీసిన ఇంటి గొడవ

పీర్జాదిగూడ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఇంటి గొడవ ఓ ఇల్లాలి ఉసురు తీసింది. బోడుప్పల్ మునిసిపల్ కార్పొరేషన్‌కు చెందిన నిహారిక(35)కు ఖమ్మం జిల్లా, తిరుమలాయపాలెం మండలం, కాకరవాయి గ్రామానికి చెందిన శ్రీకర్ రెడ్డితో 2017లో వివాహం అయింది. వీరికి ఇద్దరు పిల్లలు. పెళ్లయినప్పటి నుంచి నిహారికకు పుట్టింటి వారు ఇచ్చిన ఘట్‌కేసర్ మండలం, ప్రతాపసింగారంలో గల ఇంట్లో ఉంటున్నారు. ఈ ఇల్లు తన పుట్టింటి వారు ఇచ్చినదని నిహారిక భర్తతో పదే పదే అంటుండడంతో ఇద్దరి మధ్య గొడవ జరుగుతోంది. మంగళవారం తెల్లవారు జామున ఇంటి విషయమై ఇద్దరి మధ్య ఘర్షణ జరిగి తోసుకోవడంతో నిహారిక కిందపడింది. ఆవేశంలో ఉన్న శ్రీకర్‌రెడ్డి బండరాయితో భార్య తలపై కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న మేడిపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.


నిహారిక(ఫైల్)


















కాలు, చేయి పడిపోయిన వ్యక్తికి వీల్‌చైర్

బేగంపేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పక్షవాతం వచ్చి కాలు, చేయి పనిచేయని వ్యక్తికి రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్‌చైర్మన్, ప్రజావాణి ఇన్‌చార్జి డాక్టర్ జి. చిన్నారెడ్డి వీల్‌చైర్‌ను అందజేశారు. హైదరాబాద్‌లోని కాటేదాన్ టీఎంజీ కాలనీకి చెందిన ఎస్ శేఖర్ ప్రైవేట్ కంపెనీలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో అనారోగ్య సమస్యల తో పక్షం వాతం వచ్చి కుడిచేయి, కాలు పనిచేయడం లేదు. మంగళవారం మహాత్మాజ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన అతడు పెన్షన్ కోసం దరఖాస్తు చేశాడు. నడవలేని అతడి పరిస్థితిని గమనించిన చిన్నారెడ్డి ప్రజావాణి ద్వారా వీల్‌చైర్ అందజేశారు. వీల్‌చైర్ ఇవ్వడంతో సీఎం రేవంత్‌రెడ్డి, చిన్నారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజావాణి బాధ్యులు రాకేష్‌రెడ్డి, జగన్, సాయి, సహదేవ్, శేష తదితరులు పాల్గొన్నారు.


బాధితుడికి వీల్‌చైర్ అందజేస్తున్న ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి

ప్రజావాణికి 354 దరఖాస్తులు

మహాత్మాజ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం జరిగిన ప్రజావాణికి 354 దరఖాస్తులు వచ్చాయి. ప్రజావాణి ఇన్‌చార్జీ చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్య పౌరుల నుంచి అర్జీలను స్వీకరించారు. కొన్ని అర్జీలను అక్కడికక్కడే పరిష్కరించడంతోపాటు మరికొన్నింటిని ఎండార్స్‌మెంట్ చేసి సంబంధిత అధికారులకు పంపారు.

సాఫ్ట్‌బాల్ విజేత హైదరాబాద్

మెదక్ అర్బన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): సీఎం కప్ సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీల్లో పురుషుల విభాగంలో హైదరాబాద్ జట్టు విజేతగా నిలిచింది. నాలుగు రోజులుగా మెదక్ స్టేడియంలో జరుగుతున్న ఈ రాష్ట్రస్థాయి పోటీలు మంగళవారం ముగిశాయి. ఫైనల్లో హైదరాబాద్ విజేతగా నిలవగా, నిజామాబాద్ రన్నరప్‌తో సరిపెట్టుకుంది. మెదక్ తృతీయ స్థానం దక్కించుకుంది.



హైదరాబాద్ జట్టు

'నీలోఫర్'లో సుడాన్ మహిళకు మెరుగైన వైద్యం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ ఐవీఎఫ్ ద్వారా గర్భం దాల్చిన మహిళకు నీలోఫర్ వైద్యులు మెరుగైన చికిత్స అందించి, తల్లీ బిడ్డలను కాపాడారు. సూడాన్ కు చెందిన మహిళ(43)కు గతంలో ఐదు సార్లు అబార్షన్ జరిగింది. ఐవీఎఫ్ ద్వారా గర్భం దాల్చిన మహిళకు బీపీతోపాటు పలు ఆరోగ్య సమస్యలు చుట్టుముట్టాయి. ప్రైవేటు ఆస్పత్రులకు తీసిపోని విధంగా క్లిష్టమైన డెలివరీ సమయంలో ఆమెకు నీలోఫర్ వైద్యులు మెరుగైన చికిత్స అందించడంతో ఎలాంటి ప్రాణాపాయం లేకుండా బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డల ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని వైద్యులు తెలిపారు. రెండు రోజుల తర్వాత తల్లీ బిడ్డలను డిశ్చార్జ్ చేస్తామని నీలోఫర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ రవి కుమార్ తెలిపారు.

రాయల్ ఎన్‌ఫీల్డ్ మాత్రమే..

(5వ పేజీ తరువాయి)

చెరుతో సహా మొత్తం 15 పోలీస్‌స్టేషన్ల పరిధుల్లో 24 కేసుల్లో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్స్ జాబితాలో వీరు ముగ్గురూ ఉన్నారు.

ఇలా పట్టుబడ్డారు

రెండు రోజుల క్రితం చైతన్యపురి పోలీసులు విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా.. రాచకొండ పరిధిలో ఆరు బైక్‌లను చోరీ చేసింది వారే అని తేలింది. ఇప్పటి వరకు 30 బైక్‌లను చోరీ చేసినట్లు నిందితులు అంగీకరించారు.స్వాధీనం చేసుకున్న బైక్‌లలో రాయల్ ఎన్‌ఫీల్డ్-12, యాక్టివా-10, స్ప్లెండర్-3, యునికార్న్-2 తదితర వాహనాలున్నాయని సీపీ తెలిపారు.

సరిపోదా ఆదివారం

(5వ పేజీ తరువాయి)

పోవడమో కాదంటారు ప్రముఖ మనస్తత్వ నిపుణురాలు డా. పద్మజ. జీవితాన్ని బుగ్గిపాలు చేసే వ్యసనాలకు దగ్గర చేసే ఇలాంటి సందర్భాలకు ఆస్కారమివ్వకపోవడం ఉత్తమం.

విద్యార్హతలు పెంచుకోవడానికి..

విద్యార్హతలు పెంచుకోవడానికి ఆదివారం అనువైన సమయం. కావాల్సిన కోర్సులు ఆఫర్ చేసే ఓపెన్ యూనివర్శిటీలు ఎన్నో. డిప్లొమా సర్టిఫికెట్ కోర్సులు కూడా అందుబాటులో బోలెడు. ఆదివారం క్లాసుకు వెళితే ఏడాది తిరిగేసరికి మీ పేరు పక్కన కొత్త డిగ్రీలు చేరతాయి. కొత్త ఏడాదిలో తొలి ఆదివారం నాటికి అనుకున్న కోర్సులో చేరేలా ఇవాల్టి నుంచి శోధన మొదలుపెడదాం.

ప్రకృతిలోకి ప్రయాణించాలంటే లక్షలరూపాయలు వెచ్చించి దేశ దేశాలు తిరగక్కర్లేదు. నగర సమీపంలోనే చూడదగ్గ ప్రదేశాలు బోలెడున్నాయి. వికారాబాద్ అడవులు, అమ్మపల్లి దేవాలయం, వరంగల్ వెయ్యిస్తంభాల గుడి, రామప్ప దేవాలయం, మెదక్ చర్చి, అల్వాల్ దర్గా.. కర్నూలు కొండారెడ్డి బురుజు, నాగార్జున సాగర్ ఐల్యాండ్, ఇలా వారసత్వ కట్టడాలు, ప్రకృతి నిలయాలు నగరం చుట్టుపక్కలెన్నో ఉన్నాయి. బంధు మిత్రులతో వాటిని చూసిరావడానికి, వాటి చరిత్రను తెలుసుకోవడానికి ఆదివారాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు.

కుటుంబంతో సంతోషంగా..

వారంలో ఆరు రోజులు కుటుంబం అంతా కలిసి భోజనం చేయడం కానివని. పిల్లలు పెద్దలు కలిసి కూర్చొని కబుర్లు చెప్పుకోవడం కష్టమే. ఆదివారం ఆ అరుదైన అవకాశాన్ని ఇస్తుంది. ఇంట్లోవారంతా కలిసి గార్డెనింగ్ చేస్తూనో, ఇంటి పనిని పంచుకుంటూనో కబుర్లు చెప్పుకోవచ్చు. అందరి ఆలోచనలు. వారి అనుభవాలు. ముఖ్యంగా పిల్లల ప్రవర్తన, వారి స్నేహితుల సంగతులు, పాఠశాల విషయాలు వంటివాటిని తెలుసుకోడానికి తల్లిదండ్రులకు అనువైన సమయం. ఆ వేళ స్మార్ట్‌ఫోన్‌ను సైలెంట్‌లో పెట్టడం ఉత్తమం. లేకుంటే ఇల్లు బీపీఓ సెంటర్ అవుతుంది. ఇలా.. మనకిష్టమైన పనులు చేస్తూ, అసక్తులని పదునుపెట్టుకుంటూ, ఆశయాలను నెరవేర్చుకోవడం కోసం ఆదివారాలను మలుచుకోవచ్చు.

స్పెషల్ డ్రైవ్ మరో 90 రోజులు

(5వ పేజీ తరువాయి)

విధించుకున్నారు. మంగళవారం వరకు 90 రోజులు పూర్తయ్యే సరికి స్పెషల్ డ్రైవ్ ద్వారా 17,050 ప్రాంతాల్లో 2,200కిలో మీటర్ల సివరేజీ పైపులైన్లను క్లీన్ చేశారు. 1.75 లక్షల మ్యాన్‌హోళ్లలో డీ-సిల్టింగ్ పనులు పూర్తి చేశారు. స్పెషల్ డ్రైవ్ ఫలితంగా రోజువారీగా వచ్చే సివరేజీ ఫిర్యాదులు 30 శాతానికి తగ్గాయని అధికారులు ప్రకటించారు.

రోజువారీ పర్యవేక్షణతోనే..

90 రోజుల స్పెషల్ డ్రైవ్ పర్యవేక్షణకు ఆన్‌లైన్‌లో ప్రత్యేక డాష్ బోర్డ్ ఏర్పాటు చేశారు. మురుగు నీటి నిర్వహణలో రోజూవారీగా ఉపయోగించే 220 ఎయిర్‌టెక్ మిషన్లు, 146 సిల్ట్ తరలింపు వాహనాలు, సివరేజీ సిబ్బందితో పనులు చేయించారు. వాటర్ బోర్డుకి రోజువారీగా వచ్చే ఫిర్యాదులను పరిష్కరించడంతోపాటు.. ఒక్కో టీమ్ 100 నుంచి 200 మీటర్ల మేర పైపులైన్, 20 నుంచి 25 మ్యాన్ హోళ్లను శుభ్రం చేసింది. డాష్ బోర్డులో శుభ్రం చేసిన పైపులైన్ల పొడవు, మ్యాన్ హోళ్ల సంఖ్య వివరాలు ఫొటోలతో సహా.. అప్‌లోడ్ చేస్తే సంబంధిత సెక్షన్ స్పెషల్ డ్రైవ్‌లో చురుకుగా ఉన్నట్లుగా నిర్ధారించారు. దీంతో ఒక్కో సెక్షన్ పోటీ పడి సివరేజీ క్లీనింగ్, మ్యాన్‌హోళ్ల శుభ్రం చేపట్టాయి.

సీఎం అభినందన

స్పెషల్ డ్రైవ్ సత్ఫలితాలనివ్వడంతో సీఎం రేవంత్‌రెడ్డి వాటర్‌బోర్డు అధికారులు, సిబ్బందిని అభినందించారు. 90 రోజుల్లో మంచి ఫలితాలు రావడంతో ఈ డ్రైవ్‌ను మరో 90 రోజులు పొడిగించాలని ఆదేశించారు. ఇదే ఊపును రానున్న రోజుల్లో కొనసాగించి మిగిలిన పైపులైన్లు, మ్యాన్‌హోళ్లలో పూడిక తీత పనులు చేపట్టాలని, వర్షాకాలం నాటికి సివరేజీ పైపులైన్లు, మ్యాన్‌హోళ్లలో వ్యర్థాలు లేకుండా చూడాలని సూచనలు చేశారు.

రూ. 815.76 కోట్లు

● 2024లో పట్టణ ప్రణాళిక విభాగానికి ఆదాయం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రణాళికా విభాగానికి 2024 సంవత్సరంలో రూ.815.76 కోట్ల ఆదాయం వచ్చిందని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో జీహెచ్‌ఎంసీ పేర్కొంది. టీజీ-బీపాస్‌లో భాగంగా జనవరి నుంచి డిసెంబరు వరకు వివిధ కేటగిరీలకు సంబంధించి 14 వేలకుపైగా అనుమతులు జారీ చేశారు. ఇందులో ఇన్‌స్టంట్ రిజిస్ట్రేషన్/అనుమతులు తీసుకున్నవి 10176 కాగా.. సింగిల్ విండో అనుమతులు 3867 ఉన్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు రూ.580 కోట్ల ఆదాయం సమకూరింది. జనవరి నుంచి ఈ మొత్తం రూ.815.76 కోట్లుగా అధికారులు చెబుతున్నారు. టౌన్‌ప్లానింగ్ ఆధ్వర్యంలో రహదారుల విస్తరణ, జంక్షన్ల అభివృద్ధి కోసం ఆస్తుల సేకరణకు శ్రీకారం చుట్టారు. ట్రై కమిషనరేట్ల పరిధిలోని 90 చౌరస్తాల్లో ఆస్తుల సేకరణకు రూ.233 కోట్లు అవసరమని అంచనా వేశారు. ఇందులో 74 జంక్షన్ల ప్రతిపాదనలు ఆమోదం పొందగా.. 16 చోట్ల వివిధ దశల్లో ఉన్నాయి. హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(హెచ్-సిటీ)లో భాగంగా చేపట్టనున్న వంతెనలు, అండర్‌పాస్‌లు, రహదారుల విస్తరణకు 38 ప్రాంతాల్లో ఆస్తుల సేకరణ చేపట్టనున్నారు. ఇందులో 27 ప్రాంతాల్లో రహదారి అభివృద్ధి ప్రణాళికలు ఆమోదం పొందగా.. 11 చోట్ల ప్రతిపాదన దశలో ఉన్నాయి.

పర్యాటకులు 1.92 కోట్లు

(5వ పేజీ తరువాయి)

టూరిస్టులు సందర్శించడం ఆసక్తికరంగా మారింది.

టూరిజం పాలసీపై ఆసక్తి

కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా తీసుకొస్తున్న టూరిజం పాలసీపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. బీఆర్ఎస్ పదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పటికీ గ్రేటర్ పర్యాటకాన్ని అభివృద్ధి చేసిన దాఖలాలు కనిపించలేదు. ఎన్టీఆర్ గార్డెన్, లుంబినీ పార్కు లాంటి ప్రాంతాల్లో చెప్పుకోదగిన పనులు చేపట్టకపోవడంతో పాతవాటినే పర్యాటకులు ఆస్వాదించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రేటర్ పర్యాటకాన్ని మరింతగా తీర్చిదిద్దాలని టూరిస్టులు కోరుతున్నారు. గోల్కొండ కోట, చార్మినార్ వద్ద ప్రత్యేక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/PBj2fsg లో చదవండి. Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు. నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.





న్యూ ఇయర్ ఆంగ్లేయుల సంస్కృతి

● ఎమ్మెల్యే రాజాసింగ్

మంగళ్‌హట్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): న్యూ ఇయర్ అనేది ఆంగ్లేయుల సంస్కృతి అని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉగాది మాత్రమే మనకు నూతన సంవత్సరం అని గుర్తు చేశారు. డిసెంబర్ 31 నుంచి జనవరి 1 అనే తేదీ మాత్రమే మారుతోందని, భవిష్యత్తు మారదని ఆయన పేర్కొన్నారు. హిందూ బంధువులందరూ దేశ సేవ, హిందూ ధర్మ రక్షణ కోసం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.




































హైదరాబాద్ సిటీ: హాస్టళ్లను మూసేయాలి

నగరంలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ హాస్టళ్లను మూసివేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు లెనిన్ అధికారులను డిమాండ్ చేశారు.







తెలుగు వర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలి

అఫ్జల్‌గంజ్: తెలుగు యూనివర్సిటీకి అమరజీవి పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలని ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రధానమంత్రి నరేంద్రమోదీలకు లేఖలు రాశారు.



